క్లుప్తంగా

టీటీడీ చైర్మన్‌గా భూమన ఎంపికపై హర్షం

తంబళ్లపల్లె : తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా రెండోసారి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వీరాభిమాని కోసువారిపల్లె పంచాయతీకి చెందిన తరుగు శివారెడ్డితో పాటు స్థానిక సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

15 లీటర్ల సారా స్వాధీనం

పీలేరు రూరల్ : మండలంలోని జాండ్ల తాండాలో దాడులు నిర్వహించి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కుసుమనాయక్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ వై. గురుప్రసాద్ తెలిపారు. అలాగే గూడరేవుపల్లె పంచాయతీ మర్రిమాకులపల్లె పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు వివరించారు. ఈ దాడిలో ఎస్ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది యోగానంద్, సుధాకర్, బాలకృష్ణ, గంగాభవాని పాల్గొన్నారు.

మర్రిచెట్టు తొలగింపునకు చర్యలు



మర్రిచెట్టును ముక్కలు చేస్తున్న కూలీలు

బి.కొత్తకోట : బి.కొత్తకోట–మదనపల్లె మార్గంలోని కాండ్లమడుగు వద్ద 200 ఏళ్లనాటి మర్రిచెట్టు సోమవారం ఉదయం కూలిపోయిన సంగతి పాఠకులకు తెలిసిందే. ఈ భారీ చెట్టు రోడ్డుపై అడ్డంగా కూలడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. దీనిపై ఎస్ఐ రామమోహన్ చెట్టును తొలగించే చర్యలు చేపట్టారు.

నేటి నుంచి వసుధకు వందనం కార్యక్రమం

రామసముద్రం : మండలంలో బుధవారం నుంచి వసుధకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నారాయణస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీన కుదురుచీమనపల్లె, మూగవాడి, మాలేనత్తం, చొక్కాండ్లపల్లి, రాగిమాకులపల్లి, మినికి పంచాయతీలో నిర్వహిస్తామన్నారు. 10వ తేదీ ఆర్.నడింపల్లి, పెద్దకురప్పల్లి, నారిగానిపల్లి, చెంబకూరు, ఎలకపల్లి, కమ్మవారిపల్లి, ఎలవానెల్లూరు, 14వ తేదీ అరికెల, మానేవారిపల్లి, ఊలపాడు, కురిజల, కాప్పల్లి, రామసముద్రం పంచాయతీలలో వసుధకు వందనం కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఆక్రమణలు తొలగింపు



జగనన్న కాలనీ వద్ద అక్రమ కట్టడాలను జేసీబీ సాయంతో తొలగిస్తున్న దృశ్యం

కలికిరి : కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని మదనపల్లి రోడ్డు సీఎల్ఆర్‌సీ సమీపంలో గల జగనన్న కాలనీలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పర్యటించిన సందర్భంగా అక్కడి ఆక్రమణలపై రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్పందించిన రెవెన్యూ అధికారులు మంగళవారం ఆక్రమణలపై సర్వే నిర్వహించారు. అనంతరం జేసీబీ సాయంతో ఆక్రమిత కట్టడాలను తొలగించారు. అలాగే కాలనీ దారికి సంబంధించి భూ పట్టాదారుల నుంచి భూ సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మల్లెల పంచాయతీ ఉప్పరవాండ్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ మహమూద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం గొడుగువారిపల్లి, ఉప్పరవాండ్లపల్లిలో డ్రైనేజీ, రోడ్డు సమస్యలపై స్థానికులతో చర్చించారు. ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి సహకారంతో సమస్యను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీటీసీ చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

పోస్టాఫీసులో జాతీయ జెండా విక్రయాలు

వాల్మీకిపురం : హర్ ఘర్ తిరంగా 2.0 కార్యక్రమాన్ని పురస్కరించుకొని వాల్మీకిపురం పోస్టాఫీసులో జాతీయ జెండాలను విక్రయిస్తున్నట్లు సబ్ పోస్టుమాస్టర్ నిరంజన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, వినియోగదారుల సౌకర్యార్థం రూ.25కే జాతీయ జెండాను అందిస్తున్నట్లు తెలిపారు.

13న జోహార్ గద్దర్ ర్యాలీ

మదనపల్లె : తెలుగు పాట బలాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ప్రజాగాయకుడు గద్దర్ అని, సాయుధ విప్లవ పోరాటానికి, అంబేద్కరైట్ ఉద్యమాలకు, బౌద్ధధర్మ ప్రచారానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని వీసీకే పార్టీ నేత పీటీఎం శివప్రసాద్ అన్నారు. గద్దర్ మృతికి సంతాపాన్ని తెలుపుతూ వీసీకే పార్టీ, భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో నెల రోజుల పాటు సంతాపదినాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా ఆదివారం మదనపల్లెలో జోహార్ గద్దరన్న సంతాప ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు.

స్వచ్ఛ ఓటరు జాబితా లక్ష్యంగా పనిచేయాలి

ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ



రాజకీయపార్టీల నాయకులు, ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ

మదనపల్లె : స్వచ్ఛ ఓటరు జాబితా తయారు చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, భారత ఎన్నికల కమిషన్ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ అన్నారు. మంగళవారం సబ్ కలెక్టరేట్‌లో వివిధ రాజకీయపార్టీల నాయకులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రక్షాళనలో బీఎల్‌ఓలది కీలక భూమిక అన్నారు. ఇంటింటి సర్వే సమయంలో 18 సంవత్సరాలు దాటిన వారిని గుర్తించి, ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేయాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలని, తిరస్కరించే దరఖాస్తులకు, ఆమోదించిన దరఖాస్తులకు గల కారణాలను స్పష్టంగా తెలపాలని సూచించారు. ఓటరు జాబితాలో ఉండి మరణించిన వారి పేర్లను ఫామ్–7తో తొలగించాలని, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు జారీచేసిన మరణ ధ్రువీకరణ పత్రం ఆధారంగా జాబితా నుంచి పేర్లను తొలగించాల్సి ఉంటుందన్నారు. భారత ఎన్నికల కమిషన్ స్వచ్ఛ ఓటరు జాబితా రూపకల్పనపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఓటర్ల జనాభా నిష్పత్తి, పురుష, స్త్రీ ఓటర్ల నిష్పత్తి, పోలింగ్ కేంద్రాల వారీగా పరిశీలించాలని తహసీల్దార్‌లకు సూచించారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకుని బీఎల్‌వోలతో కలిసి ఇంటింటి సర్వేపై పర్యవేక్షణ చేయవచ్చన్నారు. ఎన్నికల కమిషన్ బీఎల్‌ఓలతో పాటుగా వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనడంపై నిషేధం విధించిందని, అలాంటివి ఎక్కడైనా ఉంటే తమదృష్టికి తేవాలన్నారు. బీఎల్‌ఓలు ఫారం–6ను ఫొటో లేకుండా ఆన్‌లైన్ చేయవద్దని, ఓటరు చిరునామా, నియోజకవర్గం మార్చుకోవడానికి ఫారం–8 ఇవ్వాలన్నారు. ప్రవాసాంధ్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలంటే ఫారం–6ఏను ఇవ్వాలన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో 1,32,195 ఇళ్లు ఉంటే.. 2,47,937 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీటిలో ఇప్పటివరకు ఇంటింటి సర్వేలో భాగంగా బీఎల్వోలు 50,390 ఇళ్లు తిరిగారని, 87,687మంది ఓటర్లను జాబితా ఆధారంగా పరిశీలించారన్నారు. ఆగస్టు 21లోపు 100 శాతం ఇంటింటి సర్వేను బీఎల్వోలు పూర్తిచేయాలన్నారు. తర్వాత ఆగస్టు 22 నుంచి రాజకీయపార్టీల సూచన మేరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్లు మహబూబ్‌చాంద్, సీ.ఆర్.మంజుల, సీకే. శ్రీనివాసులు, కాంగ్రెస్, సీపీఎం ప్రతినిధులు రెడ్డిసాహెబ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 10 వరకు నామినేషన్ల స్వీకరణ

కేవీపల్లె : మండలంలోని తువ్వపల్లె పంచాయతీలో ఖాళీగా ఉన్న 5వ వార్డు మెంబర్ స్థానం భర్తీకి ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తువ్వపల్లె పంచాయతీ 5వ వార్డుకు సంబంధించి ఎస్సీ మహిళకు రిజర్వేషన్ కల్పించినట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు నామినేషన్లు వేయాలని కోరారు. ఈ నెల 11న నామినేషన్ల పరిశీలన, 12న నామినేషన్లపై విజ్ఞప్తులు, 13న విజ్ఞప్తుల పరిష్కరించుట, 14న నామినేషన్ల ఉపసంహరణ, 19న ఎన్నికలు, మధ్నాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు.

వార్డుకు ఒక నామినేషన్ దాఖలు

రామసముద్రం : రామసముద్రం మండలం చొక్కాండ్లపల్లి గ్రామానికి చెందిన రెండవ వార్డుకు మంగళవారం ఒక నామినేషన్ దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీడీఓ నారాయణస్వామి తెలిపారు. చొక్కాండ్లపల్లిలో రెండవ వార్డుకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో ఎ.వెంకటరమణారెడ్డి నామినేషన్ దాఖలు చేసినట్లు చెప్పారు. రామసముద్రం 11 వ వార్డు, రాగిమాకులపల్లె ఒకటవ వార్డు, ఎలవానెల్లూరు 2వ వార్డు, ఆర్.నడింపల్లె 4వ వార్డు, చొక్కాండ్లపల్లి రెండవ వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు నామినేషన్లు వేసేందుకు గడువు ఉందని పేర్కొన్నారు.

మొదటి రోజు నామినేషన్లు నిల్

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మూడు పంచాయతీల్లోని ముగ్గురు వార్డు సభ్యులు మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో మంగళవారం మొదటి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మల్లెల పంచాయతీలోని 6వ వార్డు (ఎస్సీ జనరల్), రాపూరివాండ్లపల్లిలో 7వ వార్డు (బీసీ–జనరల్), తుమ్మరకుంటలోని 8వ వార్డు (జనరల్) రిజర్వేషన్ ప్రాతిపదికన ఉప ఎన్నిక జరగనుంది. ఈ నెల 10వ తేదీలోపు నామినేషన్ దాఖలు, 11న స్క్రూటినీ, 12న అభ్యంతరాలు, 13న అప్పీలు, 14న విత్‌డ్రా, 19న పోలింగ్‌తో పాటు ఫలితాలు కూడా అదే రోజు ప్రకటిస్తామన్నారు. ఎన్నికల అధికారిగా ఎంఈఓ నారాయణ నియమితులైనట్లు ఎంపీడీఓపేర్కొన్నారు.

నామినేషన్ల స్వీకరణ

తంబళ్లపల్లె : మండలంలో ఖాళీగా ఉన్న పంచాయితీ వార్డు సభ్యుల ఉప ఎన్నికకు మంగళవారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. ఎద్దులవారిపల్లె 2వ వార్డు ఎస్సీ మహిళ, తంబళ్లపల్లె 11వ వార్డు ఎస్సీ–జనరల్, కోటకొండ 7వ వార్డు బీసీ మహిళలకు రిజర్వేషన్ కేటాయించారన్నారు. గురువారం సాయంత్రం వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు.

పారదర్శకంగా జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష

డీఎల్‌పీఓ నాగరాజు



సచివాలయ సిబ్బందికి శిక్షణా సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నాగరాజు

మదనపల్లె : మదనపల్లె డివిజన్‌లోని అన్ని గ్రామ పంచాయతీలు, రెవెన్యూ గ్రామాల్లో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు డీఎల్‌పీఓ నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకానికి సంబంధించి సచివాలయ కార్యదర్శులు, సర్వేయర్లకు ఆన్‌లైన్ నమోదు విధానంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ... భూవివాదాల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ, పట్టణ ప్రాంతాల్లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములు, గ్రామకంఠాలు సమగ్ర సర్వే చేయడమే కాకుండా ప్రతి ఆస్తికి ప్రభుత్వ హామీతో కూడిన శాశ్వత హక్కు పత్రం జారీ చేస్తామన్నారు. జగనన్న సంపూర్ణ భూహక్కు పత్రాల్లో క్యూ ఆర్ కోడ్, మ్యాపుల ఫొటోలు, విస్తీర్ణం, సర్వే నెంబర్లతో సహా అన్ని వివరాలు ముద్రించామన్నారు. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే రైతులు తమ భూముల సమస్త వివరాలను తెలుసుకోవచ్చన్నారు. భూయజమాని, రైతులకు సంబంధించిన అన్ని వివరాలు ఇందులో ఉంటాయన్నారు. మదనపల్లె డివిజన్‌లో ఈ పథకంలో భాగంగా 91 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్‌ఫ్లై పూర్తయిందన్నారు. ఆయా గ్రామాలకు సంబంధించిన మ్యాపులు సర్వే ఆఫ్ ఇండియా నుంచి సాఫ్ట్ కాపీలు అందాయని, వాటిని డీపీఓ, సర్వే ఏడీ, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం మొదటి విడతలో భాగంగా 91 గ్రామాలకు 15 గ్రామాల్లో 30 నోటిఫికేషన్ ఇచ్చామని, మూడు గ్రామాల్లో రైట్ ఆఫ్ రికార్డ్స్ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా వాల్మీకిపురం మండలం విఠలం పంచాయతీ జమాల్‌పల్లె గ్రామంలో పైలట్‌ప్రాజెక్ట్ కింద 116 కార్డులను ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశామన్నారు. అలాగే మిగిలిన రెండు గ్రామాల్లోనూ జగనన్న భూహక్కు పత్రాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త వెంకటేశ్వర్లు, ఏఓ జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే

నిమ్మనపల్లె : రాష్ట్రంలోని పేదప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తూ పేదలకు భరోసా కల్పిస్తున్నారన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ కొత్త కొండసానివారిపల్లె, పాత కొండసానివారిపల్లె, ఎర్రివారిపల్లె, పిల్లగోవులపల్లె, నల్లంవారిపల్లె గ్రామాల్లో సర్పంచ్ శ్రీవాణి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రమణారెడ్డి, సచివాలయ కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులు పొందిన సాయాన్ని చదివి వినిపించారు. బుక్‌లెట్‌ను అందించారు. జగనన్న అందిస్తున్న పథకాలతో ప్రతి కుటుంబం సంతృప్తిగా ఉందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతినెలా 1వతేదీ ఉదయాన్నే తలుపుతట్టి అవ్వాతాతలకు, వికలాంగులకు, వితంతువులకు, ఇతర పింఛనుదారులకు పెన్షన్ అందిస్తున్నారన్నారు. రైతుభరోసా ద్వారా రైతులకు ప్రతి సీజన్‌లోనూ పంటలు సాగుచేయటానికి ఆర్థిక సాయాన్ని జగనన్న అందిస్తున్నారన్నారు. రైతులు సాగుచేస్తున్న ప్రతి పంటను ఈక్రాప్‌లో నమోదుచేస్తున్నారని, అనుకోని విపత్తుల కారణంగా పంట నష్టం వాటిల్లితే తక్షణం పంట నష్టాన్ని అదే సీజన్‌లో చెల్లించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులను ఆదుకుంటున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నాడు–నేడు పనుల ద్వారా విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి పైప్‌లైన్లు, మురుగునీటి కాలువలు, సిమెంట్‌రోడ్లు, విద్యుత్‌స్తంభాల ఏర్పాటు, రెవెన్యూ సమస్యలు తదితరాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రహ్మణ్యం, కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్‌రఫీ, నాయకులు నవీన్, యుగంధర్‌రెడ్డి, మహేష్, బొట్టురమణ, శశిధర్‌రెడ్డి, తహసీల్దార్ సి.ఆర్.మంజుల, ఎంపీడీఓ శేషగిరిరావు, ఎంఈఓ పద్మావతి, ఎస్ఐ రామకృష్ణ, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరచిన రామసముద్రం విద్యార్థులు

రామసముద్రం : స్థానిక రాయచోటి జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన సీడబ్ల్యూఎస్ఎన్(దివ్యాంగులు) పిల్లల పరుగు పందెం పోటీలలో రామసముద్రం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం చిట్టిబాబు తెలిపారు. పాఠశాలకు చెందిన డి.శశికుమార్, లతాశ్రీ, కిసాన్ సాయి జిల్లా స్థాయిలో పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి మొదటి స్థాయిలో బహుమతి అందుకున్నారని తెలిపారు. వారికి శిక్షణ ఇచ్చిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ నారాయణస్వామి, భవిత టీచర్ నాగేంద్రప్రసాద్‌లను తల్లిదండ్రులు అభినందించారు. విద్యార్థుల ప్రతిభ పట్ల ఎంఈఓలు హేమలత, ఆంజనేయులు, హెచ్ఎం, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు ఏపీ ఆదర్శం



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు : అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని చెన్నారెడ్డివీధి, కడప రోడ్డు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే సమస్యలపై ఆరా తీశారు. రాష్ట్రంలో విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం చేయడానికి పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. పార్టీలకతీతంగా అభివృద్ధి ఫలాలు అందుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, జి.వి. రాకేష్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్ల దారి సమస్య పరిష్కారం



ఇరు గ్రామాల పెద్దలతో రాజీ చేస్తూ చేతులు కలిపిన తహసీల్దార్ విద్యాసాగర్

పెద్దతిప్పసముద్రం : ఇటు రైతులకు, అటు ప్రజలకు ఇబ్బందికరంగా, వివాదాస్పదంగా ఉన్న బండిబాట సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. మండలంలోని టి.సదుం పంచాయతీ రామాపుం నుంచి పూలకుంట, ఎరబల్లి వరకు వ్యవసాయ పొలాలకు వెళ్లే బండిబాట సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గత రెండేళ్లుగా విసిగి వేసారిన పలువురు తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డికి సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణం పరిష్కరించాలని తహసీల్దార్ విద్యాసాగర్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంగళవారం తహసీల్దార్‌తో పాటు ఉప సర్పంచ్ పీఎస్ మధు, వీఆర్వో ఖాదర్‌బాషాలు గ్రామానికి వెళ్లి ఇరు గ్రామాల ప్రజలతో చర్చించి దారి సమస్యను పరిష్కరించారు.

మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించాలి

మదనపల్లె సిటీ : మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మణిపూర్ మారణకాండను నిరసిస్తూ మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయంలో రాష్ట్రపతి జోక్యం చేసుకుని ప్రజలను కాపాడాలన్నారు. ప్రధాని పార్లమెంటులో ప్రకటన చేయకపోవడంపై ఖండించారు. అనంతరం పట్టణంలో పలు ప్రాంతాల్లో కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరినాథ్‌శర్మ, రఘునాథ్, పవన్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనపై అవగాహన అవసరం

పీలేరురూరల్ : నులిపురుగుల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీహెచ్ఓ డి. నందిని అన్నారు. మంగళవారం మండలంలోని జంగంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులందరూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండోజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గంగాధరం, ఏఎన్ఎం అనసూయమ్మ, యల్లమ్మ, శ్రీలత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అంకాళమ్మ విగ్రహ ప్రాణప్రతిష్ట

కలికిరి : మండలంలోని మునెళ్లపల్లి గ్రామం మూరేవాండ్లపల్లిలో నిర్మించిన ఆలయం ప్రారంభమై 108వ రోజు సందర్భంగా బుధవారం అంకాళమ్మ, గంగమ్మ నూతన విగ్రహాల ప్రాణప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారి మూల విగ్రహాలకు అభిషేకం, ప్రాణ ప్రతిష్ట, భక్తులకు అన్నదాన కార్యక్రమం, అనంతరం విగ్రహాల గ్రామోత్సవం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో స్టేట్ కౌన్సిల్ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఏపీఎన్జీఓ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి కృష్ణ చైతన్య, ఎంపీడీఓ వెంకటేశులు పాల్గొన్నారు. ఈనెల 21, 22 తేదీలలో విజయవాడలోని మున్సిపల్ స్టేడియంలో జరిగే ఈ మహాసభలకు ఎన్జీఓలందరూ హాజరు కావాలని కోరారు. డివిజనల్ ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ కార్యదర్శి రాజేష్, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శిస్తే సహించం



కె.జ్యోతి

తంబళ్లపల్లె : ఉమ్మడి చిత్తూరు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తూ నిరుపేదల గుండెల్లో నిలిచిన పెద్దిరెడ్డి కుటుంబీకులను టీడీపీ నాయకులు విమర్శిస్తే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కె.జ్యోతి హెచ్చరించారు. నాటి నుంచి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిలు ప్రజలకు అండగా నిలిచి జిల్లా అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు ఓటమి భయంతో అల్లర్లు సృష్టించి లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు.

ఐసీఐసీఐ ఫౌండేషన్‌తో తెట్టు గ్రామ అభివృద్ధి

కురబలకోట : ఐసీఐసీఐ ఫౌండేషన్ ద్వారా కురబలకోట మండలంలోని తెట్టు గ్రామాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ఆ బ్యాంకు ఫౌండేషన్ ఏపీ, తెలంగాణ జోనల్ హెడ్ రాకేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం తెట్టు గ్రామ సర్పంచ్ నులక మనోహర్‌రెడ్డి అధ్యక్షతన గ్రామస్తులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాటర్ షెడ్ తరహాలో గ్రామంలో వివిధ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. తద్వారా జీవన ప్రమాణాలు మెరుగుకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర హెడ్ శిరీషా, ఆలయ కమిటీ చైర్మన్ కొరివి జగన్నాథరెడ్డి, ఏపీడీ మధు, మాజీ ఉప సర్పంచ్ నారాయణ, శ్రీనివాసులు, కార్యదర్శి నవాజ్ బాషా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇచ్చిన ప్రతి హామీ నెరవేరాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

కలకడ : పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇచ్చిన ప్రతి హామీ గ్రామీణ ప్రాంతాల్లో నెరవేరాలని ఎంపీపీ శ్రీదేవి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తుల్లో పరిష్కరించినవి, ఇంకా పరిష్కారం కానివి తెలియజేయాలన్నారు. అభివృద్ధికి సంబంధించినవి వందశాతం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, ఏపీఓ చెన్నకేశవులు, పంచాయతీ కార్యదర్శులు బాలకృష్ణ, షబానాబాను, సద్దాంహుస్సేన్, మునిరాజా, వీఆర్ఓ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పక్కా గృహ నిర్మాణాలను నాణ్యతగా చేపట్టాలి



కొండయ్యగారిపల్లె లేఅవుట్‌లో పక్కా గృహ నిర్మాణాల నాణ్యతను పరిశీలిస్తున్న దృశ్యం

నిమ్మనపల్లె : రాష్ట్రప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన జగనన్న పక్కాగృహ నిర్మాణాలను నాణ్యతతో చేపట్టి పూర్తిచేయాలని వ్యాప్ కో టీం లీడర్ కరీముల్లా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జగనన్న లేఅవుట్లలో జరుగుతున్న పక్కా గృహ నిర్మాణ పనులను చెన్నైకి చెందిన (థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ మానిటర్ ఏజెన్సీ) వ్యాప్ కో టీం లీడర్ కరీముల్లా, హౌసింగ్ ఏఈ అమరనాథ్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న పక్కాగృహ నిర్మాణాలకు టిపిక్యూం ఏహార్డ్‌కో నిధులతో నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. అందులోని నాణ్యతా ప్రమాణాలను పరిశీలించేందుకు వచ్చామన్నారు. అందులో భాగంగా మండలంలోని కొండయ్యగారిపల్లె, దండువారిపల్లె, దిగువపల్లె, వెంకోజిగారిపల్లె లేఅవుట్లలోని యూడీఏ 1920 ప్రాజెక్ట్ కింద మంజూరైన డీపీఆర్ 1,038 పక్కా గృహ నిర్మాణపనులను లబ్ధిదారుల సమక్షంలో పరిశీలించినట్లు చెప్పారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ సహాయకులు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు హేమ, అశ్విని, వరప్రసాద్, హౌసింగ్ సిబ్బంది అనూష, రవి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఈనెల 12 నుంచి ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా మహాసభలు



కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పీలేరు రూరల్ : ఈ నెల 12 నుంచి నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా 2వ ప్లీనరీ సమావేశాలు జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమ నిర్మాణం విద్యారంగం సమస్యలపై సమరశీల పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శశి, తేజ, రూపకుమార్, రోహిత్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ 88వ వార్షికోత్సవం జయప్రదం చేయాలి

మదనపల్లె సిటీ : ఏఐఎస్ఎఫ్ 88వ వార్షికోత్సవం జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక నక్కలదిన్నెలోని బీసీ సంక్షేమ వసతిగృహంలో వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 12న జిల్లాలోని అన్ని ప్రధాన పట్టణాల్లో వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తామన్నారు. విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మాధవ్, వినయ్, వెంకటేష్, వంశీ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సిమెంటు రోడ్ల నిర్మాణం



తురకపల్లెలో జరుగుతున్న సిమెంటు రోడ్డు నిర్మాణం పనులు

పెద్దమండ్యం : మండలంలోని బండమీదపల్లె పంచాయతీలో సిమెంటు రోడ్ల నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన విషయం తెలిసిందే. సిమెంటు రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు ఎమ్మెల్యేని కోరారు. దీంతో రూ. 20 లక్షల నిధులతో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ నేపథ్యంలో గ్రామ పరిధిలోని తురకపల్లె, కొట్టేవాండ్లపల్లె, బండమీదపల్లె, తుస్సావారిపల్లెల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే మిట్టావాండ్లపల్లెలో డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టారు.